ఎస్సీ వర్గీకరణ ఏకగ్రీవం

- సాకారమైన మూడు దశాబ్దాల కల
- దళితులకు పార్టీలో, ప్రభుత్వంలో ఎన్నో అవకాశాలిచ్చాం
- దామోదర సంజీవయ్యను సిఎంగా చేసింది కాంగ్రెస్సే
- 2011 జనాభా లెక్కల ప్రకారం వాటాలు పంచాం
- 2026 లెక్కల తర్వాత దామాషా ప్రకారం పెంచుతాం
- పోరాటంలో అసువులు బాసిన వారికి చేయూత అందిస్తాం
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ఎస్సీ వర్గీకరణ బిల్లును మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో దశాబ్దాలుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటానికి గొప్ప విజయం లభించింది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం శాసన సభలో రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి బిల్లును ప్రవేశపెట్టింది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం బిల్లుపై చర్చను ప్రారంభిస్తూ బిసి కులగణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఆమోదం పొందడమనేది కాంగ్రెస్ ప్రభుత్వ దార్శనికతకు నిదర్శనమని చెప్పారు. రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు దీనికి మద్దతివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ నుంచి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంఐఎం సభ్యులు మాజిద్ హుస్సేన్, సిపిఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు, బిజెపి నుంచి పాయల్ శంకర్‌తో పాటు శాసన సభ్యులు కడియం శ్రీహరి, కందుల సామేల్, కె.సత్యనారాయణ, మాణిక్‌రావు, కోట లక్ష్మీకాంతరావు, వివేక్ వెంకటస్వామి, కాలే యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటున్నదని తెలిపారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ ఎన్నో అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. 'బాబూ జగ్జీవన్‌రామ్‌కు మా పార్టీ కేంద్రంలో ఆయా శాఖల బాధ్యతలు అప్పగించి గౌరవించింది. దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్యను సీఎంగా చేసింది కాంగ్రెస్ పార్టీయే. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం అనేక పోరాటాలు జరిగాయి. దశాబ్దాలుగా సాగిన ఉద్యమంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. ఇన్నాళ్లకు నేను సీఎంగా ఉండగానే సమస్య పరిష్కారం కావడటం సంతోషకరం. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించాం. మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించాం. ఆ కమిటీ సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ ఏర్పాటు చేశాం. కమిషన్..ప్రజల నుంచి 8,681 దరఖాస్తులను స్వీకరించింది. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించాం. 59 ఎస్సీ ఉపకులాలను మూడు గ్రూపులుగా కమిషన్ విభజించింది. 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫారసులు చేసింది" అని సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు ఈ సందర్భంగా సీఎం కృతజ్ఞతలు తెలిపారు. షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లను 15 నుంచి 18 శాతానికి పెంచాలన్న ప్రతిపాదనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. రిజర్వేషన్లను పెంచడానికి సహేతుకమైన విధానం పాటించాల్సి ఉందన్నారు. 2026 జనాభా లెక్కలు పూర్తయిన తర్వాత ఆ జనాభా నిష్పత్తి మేరకు ఎస్సీ రిజర్వేషన్లను 15 నుంచి 18 శాతానికి పెంచడానికి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. రిజర్వేషన్లను పెంచడంతో పాటు దామాషా ప్రకారం గ్రూపు 1, 2, 3 కేటగిరీల వర్గీకరణ బాధ్యతను కూడా తాము తీసుకుంటామని స్పష్టం చేశారు. "ప్రస్తుత రిజర్వేషన్లను పెంచాలంటే సహేతుకమైన విధానం పాటించాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కలు మాత్రమే అధికారికంగా అందుబాటులో ఉన్నాయి. చట్టపరంగా ఎలాంటి చిక్కులు ఎదురుకాకుండా రిజర్వేషన్లు పెంచాలంటే, కేంద్ర ప్రభుత్వం 2026 జనాభా లెక్కలు చేపడితే ఆ జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడానికి వీలవుతుంది" అని వివరించారు. షెడ్యూల్డు కులాలకు మరింత ప్రయోజనం చేకూర్చే విషయంలో ప్రభుత్వం పారదర్శకమైన కార్యాచరణ చేపడుతుందనీ, ఇలాంటి విషయాల్లో భేషజాలు లేకుండా అందరినీ సంప్రదించి వారి అభిప్రాయాల మేరకు ముందుకు వెళుతామని వివరించారు. వర్గీకరణ సమస్యకు శాసనసభ శాశ్వతమైన పరిష్కారం చూపించడం ఒక చారిత్రాత్మకమైన సందర్భంగా సీఎం అభివర్ణించారు. వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళు లర్పించారు. కృష్ణమాదిగతో పాటు చాలా మంది మూడు దశాబ్దాలకు పైగా ఈ పోరాటంలో భాగస్వామ్యం అయ్యారని గుర్తు చేశారు. ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఆ కుటుంబాల్లో విద్యావంతులుంటే రాజీవ్ యువ వికాసం పథకం కింద చేయూతనందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి దామోదర రాజనర్సింహ నేతత్వంలో ఎస్సీ శాసనసభ్యులందరూ ఒక కమిటీగా ఢిల్లీ వెళ్లి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తమ వాదనను బలంగా వినిపించడం, సుప్రీంకోర్టు తీర్పు వెలువడటం, ఆ వెంటనే వంద శాతం అమలు చేస్తామంటూ శాసనసభలో ప్రకటన చేసిన పరిణామాలను ఆయన వివరించారు. సామాజిక, విద్య, ఆర్థిక రంగాల్లో పూర్తిగా వెనుకబడిన వర్గాలను గ్రూప్ 1 కింద 15 ఉపకులాలను పరిగణనలోకి తీసుకుని వారికి ఒక శాతం రిజర్వేషన్, మధ్యస్తంగా లబ్ధిపొందిన 18 ఉప కులాలను గ్రూపు 2 కింద తీసుకుని వారికి తొమ్మిది శాతం రిజర్వేషన్లు, గణనీయంగా ప్రయోజనం పొందిన కులాలను గ్రూపు 3 కింద పరిగణిస్తూ వారికి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫారసు చేశామని తెలిపారు.

సిఎంకు వినతిపత్రం అందజేస్తున్న టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

- సిఎం రేవంత్‌కు టిడబ్ల్యుజెఎఫ్ వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) ప్రతినిధి బృందం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరింది. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య నేతృత్వంలో ప్రతినిధి బృందం మంగళవారం అసెంబ్లీలో సిఎంను కలిసి వినతి పత్రం సమర్పించింది. ఇండ్ల స్థలాలు, ఆరోగ్య బీమా పథకం, అక్రిడిటేషన్ కార్డులు, పెన్షన్ పథకం, మహిళా జర్నలిస్టులకు రాత్రి సమయంలో రవాణా సౌకర్యం, అర్హత ఉన్న చిన్న, మధ్యతరహా పత్రికలకు ఎంప్యానల్ మెంట్, తదితర సమస్యలు పరిష్కరించాలని సిఎంను కోరారు. టిడబ్ల్యుజెఎఫ్ వినతిపై సిఎం సానుకూలంగా స్పందించారు. సిఎంను కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాజశేఖర్, గుడిగ రఘు, హెచ్‌యూజె అధ్యక్షులు బి.అరుణ్‌కుమార్, నాయకులు క్రాంతి, సీనియర్ జర్నలిస్టులు జాన్ రాస్, రాజేష్ జైన్, గంగాధర్, పూర్ణ చంద్రరావు, బస్వ రాజ్, తదితరులు ఉన్నారు.

చండీగఢ్ మాదిరిగా హైదరాబాద్ అభివృద్ధి

- మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చండీగఢ్ మాదిరిగా హైదరాబాద్ ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మంగళవారం శాసనమండలిలో ఫోర్త్ సిటీ ఏర్పాటు ప్రతిపాదనపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. శంషాబాద్ విమానాశ్రయం ఒఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్)ను కేంద్రంగా చేసుకుని పట్టణీకరణ వేగంగా జరుగుతోందనీ ఈ నేపథ్యంలో సుస్థిర అభివద్ధి లక్ష్యంగా ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రత్యేక నగరాన్ని అన్ని హంగులతో నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు ధీటుగా ఈ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. ఈ ఫ్యూచర్ సిటీ పరిధి రంగారెడ్డి జిల్లాకు చెందిన 7 మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 770 చ.కి.మీల విస్తీర్ణంలో ఉంటుందని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీని అన్ని సదుపాయాలతో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఫ్యూచర్ సిటీ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచి, రాష్ట్రాభివృద్ధికి, పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పనకు తోడ్పడుతుందన్నారు. డెవలప్ మెంట్ అథారిటీ కావడంతో ఇందులో విలీనమయ్యే గ్రామాల ప్రజలు గ్రామీణ ఉపాధి హామీ నుంచి దూరం కారని వివరించారు. శంభీపూర్ రాజు మాట్లాడుతూ ఫోర్త్ సిటీ కాదు ఫోర్ బ్రదర్స్ సిటీ అనుకుంటున్నారని చేసిన వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు తగవంటూ హితవు పలికారు. దీనిపై రాజు మాట్లాడుతూ శాసనసభలో బట్టలూడదీస్తామంటూ ఇంతకంటే దారుణంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలున్నాయన్నారు. అధికార పార్టీకి ఒక చట్టం, ప్రతిపక్షానికి ఇంకో చట్టం ఉన్నాయా? అని ప్రశ్నించారు. చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జోక్యం చేసుకుని బయట మాట్లాడిన వ్యాఖ్యలను సభలో మాట్లాడొద్దని సూచించారు. పెద్దల సభ ఆదర్శంగా ఉంచాలని కోరుకున్నారు.

'ఉస్మానియా'లో విధించిన ఆంక్షలు ఎత్తేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలను నిషేధిస్తూ వైస్ ఛాన్సలర్ జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని విద్యార్థులు చేస్తున్న ఆందోళనలకు మద్దతు తెలిపారు. "ఉస్మానియా యూనివర్సిటీ దేశంలోనే ప్రతిష్టాత్మకమైందిగా పేరుతెచ్చుకుంది. అనేక ఉద్యమాలకు నిలయంగా ఉంది. తెలంగాణ ఉద్యమం, వామపక్ష పోరాటాలు, విద్యార్థుల సమస్యలపై జరిగిన పోరాటాల పురిటిగడ్డగా వెలుగొందింది. సామాజిక న్యాయం కోసం, మతోన్మాదానికి వ్యతిరేకంగా అనేక భావాలపై చర్చలు జరుగుతున్న కేంద్రంగా ఉంది. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల్లో అన్యాయం జరిగిందన్న అంశాలపై నిరసనలు తెలిపి ప్రజలను చైతన్య పరిచిన చరిత్ర కలిగిన యూనివర్సిటీగా ఉంది. నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. విద్యార్థుల వాక్ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను హరించే విధంగా ఉన్న ఈ అప్రజాస్వామిక సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించాలి. యూనివర్సిటీలో ప్రశాంత వాతావరణాన్ని కల్పించే విధంగా చూడాలి...." అని జాన్ వెస్లీ ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

తమిళనాడు మాదిరిగా బిసి రిజర్వేషన్లు

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో తమిళనాడు రాష్ట్రం తరహాలో బీసీ రిజర్వేషన్లను అమలు కోసం కలిసికట్టుగా ముందుకెళ్దామని రాష్ట్ర వెనుకబడిన తరగతుల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మంగళవారం శాసనమండలిలో ఆయన రాజకీయ, విద్య, ఉద్యోగ అవకాశాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రెండు వేర్వేరు బిసి రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం శాసనసభలో ఈ బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించుకున్నామని తెలిపారు. బిల్లులకు బీఆర్ఎస్, బిజెపి, సీపీఐ, ఎంఐఎం పార్టీలు మద్దతును ఇచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం కేవలం ఒకే ఒక్క తమిళనాడు రాష్ట్రంలో 69 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. ఆ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుందామని ప్రతిపక్షాలకు పిలుపునిచ్చారు. పార్టీలకతీతంగా అందరం కలిసి ఢిల్లీకి వెళ్లి బిసి రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుదామని చెప్పారు. తెలంగాణ బిసి రిజర్వేషన్ బిల్లు భవిష్యత్తులో దేశానికి రోల్ మోడల్‌గా అవతరించబోతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఈ బిల్లులకు మండలిలో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం సభ్యులు మద్దతుగా మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సముచితమైందిగా అభివర్ణించారు. ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

ఎప్‌సెట్‌కు 1.36 లక్షల దరఖాస్తులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు 1,36,425 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కో కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజనీరింగ్ విభాగానికి 98,046 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 38,273 మంది రెండింటికీ 106 మంది కలిపి మొత్తం 1,36,425 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా వచ్చేనెల నాలుగో తేదీ వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశముందని తెలిపారు. ఆలస్య రుసుంతో అదేనెల 24 వరకు దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఇతర వివరాల కోసం https:// eapcet. tgche. ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

బిజెపి ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

- సంపన్నులకు రాయితీలు.. పేదలపై పన్నుల భారాలు : పాలడుగు భాస్కర్
- పిఎన్ఎం ఆధ్వర్యంలో ఓటరు చైతన్య యాత్ర

ప్రజావక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ అన్నారు. ప్రజానాట్యమండలి యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ చేపట్టిన ఓటరు ప్రజా చైతన్యయాత్ర మంగళవారం వలిగొండ మండలంలోని పులిగిల్ల, తుర్కపల్లి, పొద్దుటూరు, సుంకిశాల గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన బహిరంగ సభల్లో పాలడుగు భాస్కర్ మాట్లాడారు. బిజెపి అధికారంలోకొచ్చాక దేశంలో ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు నిరుద్యోగం పెరిగిపోతోందని, సామాన్యులు మూడు పూటల తిండి తినలేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. దేశంలో సంపన్నులకు భారీ రాయితీలు కల్పిస్తూ పేదలపై విపరీతమైన పన్నులు వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందన్నారు. మహిళలకు రూ.2500 ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతులకు మద్దతు ధర ఇవ్వడంలో విఫలమయ్యారని, కమ్యూనిస్టుల పాలనలో ఉన్న కేరళలో రైతుల పంటలకు మద్దతుతో కూడిన ధరను ఇస్తున్నారని, రైతుల ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా కేరళ దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.

ప్రజల కోసం పనిచేసే నాయకులను ఎన్నుకోండి..

త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల కోసం పనిచేసే సిపిఎం నాయకులను ఎన్నుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ పిలుపునిచ్చారు. గతంలో సిపిఎం ప్రజాప్రతినిధుల పాలనలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని గుర్తు చేశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉండే ప్రజానాయకులను ఎన్నుకోవాలన్నారు. వందల కోట్ల రూపాయల్ని ఖర్చుపెట్టి ప్రజాసేవ పేరుతో కొంతమంది రాజకీయాలు చేయడానికి ముందుకు వస్తున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డబ్బు, మద్యం రాజకీయాలను తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, పీఎన్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు అవ్వారు గోవర్ధన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటపాక శివ, ఈర్లపల్లి ముత్యాలు, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, సిపిఎం నాయకులు సిర్పంగి స్వామి, గణపతిరెడ్డి, గడ్డం వెంకటేష్, వాకిటి వెంకటరెడ్డి, మెరుగు వెంకటేశం, కందాడి సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ కొమ్మిడి లక్ష్మారెడ్డి, ఎంపీటీసీలు బుగ్గ ఐలయ్య, సల్లనర్సమ్మ, ఐలయ్య పాల్గొన్నారు.

టన్నెల్‌లో జియోలాజికల్ సర్వే అధికారుల పరిశీలన

- మట్టి, నీరు, భూస్థాయిల మార్పులపై విశ్లేషణ
- మరోసారి లోపలికెళ్లిన కడావర్ డాగ్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాద స్థలాన్ని మంగళవారం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు పరిశీలించారు. భూగర్భ నిర్మాణం, భూ స్థాయిల మార్పులు, టన్నెల్‌లో మట్టి పెళుసు స్థితి, నీటి ప్రవాహం ప్రభావం వంటివి పరిశీలించారు. అధ్యయనం అనంతరం, వారు సహాయక చర్యలను మరింత సమర్థంగా ముందుకు తీసుకెళ్లేందుకు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ అధికారులు, రక్షణ సిబ్బంది, ఇంజినీర్లు, జియోలాజిస్టులు, అనుభవజ్ఞులైన రెస్క్యూ టీమ్‌లు సమన్వయంతో పని చేస్తున్నట్టు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వివరించారు. అత్యాధునిక సాంకేతిక పరికరాలు, డ్రిల్లింగ్ మెషిన్లు, సెన్సార్లు, రోబోటిక్ పరికరాలు వంటి సాధనాలను వినియోగించి సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నట్టు తెలిపారు. అలాగే, టన్నెల్ ఆఫీస్ వద్ద డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్‌పి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం ఉదయం కేరళకు చెందిన కడావర్ డాగ్స్ స్క్వాడ్ టన్నెల్‌లోకి వెళ్లినట్టు అధికారులు తెలిపారు. బోరింగ్ మిషన్ ఫ్లాట్‌ఫాం భాగాలని కత్తిరించే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సమాంతరంగా టిబిఎంపైనున్న మట్టిని తొలగించడం తోపాటు టిబిఎంను కత్తిరించిన భాగాలను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ, లోకో ట్రైన్ ద్వారా బయటికి పంపిస్తున్నట్టు తెలిపారు. మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలిస్తున్నట్టు చెప్పారు.

ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ఆదుకోరా?

- తహశీల్దార్ జీతభత్యాలు చెల్లించొద్దు
- హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పత్తి సాగు చేస్తే ప్రతికూల పరిస్థితుల కారణంగా పెట్టుబడులు కూడా రాకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోకపోవడంతో హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్న అన్నదాత కుటుంబాన్ని అదుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల తీరును తప్పుబట్టింది. రైతు ఆత్మహత్య చేసుకుని పదేండ్లు అయినప్పటికీ ప్రభుత్వ పరిహారం ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించింది. చట్ట నిబంధనలకు అనుగుణంగా అన్ని అర్హతలుంటే పరిహారం చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు గతంలో తాము ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 2014లో భర్త ఆత్మహత్య చేసుకోగా ప్రభుత్వం పరిహారం మంజూరు చేసినా చెల్లించని ఎమ్మార్వో నిర్లక్ష్య తీరును ఎండగట్టింది. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నంతవరకు ఆత్మకూరు మండల తహసీల్దార్ జీత, భత్యాలను నిలిపివేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్‌ను ధర్మాసనం ఆదేశించింది. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన లక్కరుసు మొగిలి రుణాలు చేసి పత్తిసాగు చేశాడు. పంట దిగుబడి లేక చేసిన అప్పులు తీర్చలేకపోవడంతో పురుగుల మందు తాగి 2014 జులై 17న ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై అప్పట్లోనే పోలీసులు నివేదిక సమర్పించారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన పథకంలో భాగంగా ఆత్మహత్య చేసుకున్న రైతు భార్య లక్ష్మి అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని విచారించిన హైకోర్టు, లక్ష్మి చేసుకున్న దరఖాస్తు చట్ట నిబంధనలకు లోబడి ఉంటే జీవో 173 ప్రకారం రుణ పరిష్కారం రూ. లక్ష, ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రూ.5 లక్షలను నాలుగు వారాల్లోగా చెల్లించాలని గత ఏడాది అక్టోబరులో ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాలు అమలు కాలేదంటూ లక్ష్మి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయగా, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ఇటీవల విచారించారు. రికార్డులను పరిశీలిస్తే జిల్లా కలెక్టర్ ఫిబ్రవరి 13న రూ. 6 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతోపాటు ఆ మొత్తాన్ని బాధితురాలికి చెల్లించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అయితే తహసీల్దార్ ఉద్దేశపూర్వకంగా బాధితురాలికి పరిహారం చెల్లించలేదని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పరిహారం చెల్లింపులో అసాధారణ జాప్యం వల్ల ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని అభిప్రాయపడింది. బాధితురాలకి చెల్లించాల్సిన సొమ్మును విత్‌డ్రా చేసి చెల్లించే వరకు తహసీల్దార్‌కు జీతభత్యాలను చెల్లించరాదని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 28వ తేదీకి వాయిదా వేసింది.

పిటిషనర్‌కు కోటి జరిమానా

- హైకోర్టు సంచలన తీర్పు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక మంగళవారం సంచలన తీర్పు వెలువరించారు. హైకోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్ వెంకట్రామిరెడ్డికి కోటి రూపాయల జరిమానా విధించారు. ప్రభుత్వ భూముల కబ్జా యత్నాలను అడ్డుకున్నారు. ఒక పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, మరో ధర్మాసనం వద్ద పిటిషనర్ ఉత్తర్వులు పొందడాన్ని తప్పుపట్టారు. బండ్లగూడ మండలం కందికల్ సర్వే నెంబర్ 310/1, 310/2లలో 9.11 ఎకరాల భూముందనీ, అధికారులు రిజిస్ట్రేషన్ చేయడం లేదని వెంకట్రామిరెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేయొద్దంటూ బండ్లగూడ తహశీల్దార్ లేఖ రాశారని పిటిషనర్ తరపున న్యాయవాది కందగట్ల ధీరజ్ వాదించారు. పిటిషనర్ తన భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. పిటిషనర్ పేర్కొన్న సర్వే నెంబర్లు కందికల్‌లో లేవనీ, 309/5తోనే సర్వే నెంబర్ ముగుస్తుందని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. తప్పుడు పత్రాలు సృష్టించిన పిటిషనర్ వెంకట్రామిరెడ్డి ప్రభుత్వ భూమిని కాజేసే కుట్రను అడ్డుకోవాలని కోరారు. ఈ భూమిపై గతంలోనే పిటిషనర్ తండ్రి హైకోర్టులో రెండు వేర్వేరు వ్యాజ్యాలను దాఖలు చేశాక వాటిని వాపస్ తీసుకున్నారని చెప్పారు. ఈ పిటిషన్ల గురించి వెంకట్రామిరెడ్డి తన అఫిడవిట్‌లో కనీసం ప్రస్తావన కూడా చేయలేదన్నారు. పాత పిటిషన్ల గురించి చెప్పకుండా వెంకట్రామిరెడ్డి కోర్టును తప్పుదోవ పట్టించారన్నారు. కందికల్‌లోని ప్రభుత్వ భూమి విషయంలో ఇప్పటికే యాజమాన్య హక్కులపై న్యాయవివాదాలు కోర్టుల్లో ఉన్నాయని బెంచ్ దృష్టికి తీసుకొచ్చారు. వాదనలు విన్న తర్వాత పాత కేసులోని పత్రాలను పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక పిటిషనర్ ఉద్దేశపూర్వకంగా కోర్టును తప్పుదోవ పట్టించడంతో పాటు, విలువైన కోర్టు సమయాన్ని వథా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటి రూపాయల జరిమానా విధించారు.

కులవివక్ష ప్రతిఘటన పోరాటాల్లో భాగస్వాములు కావాలి

- ప్రణయ్ హత్య కేసుపై కోర్టు తీర్పు హర్షణీయం : స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేటి ఆధునిక యుగంలో కూడా గ్రామ సీమల్లో కులవివక్ష, అంటరానితనం ప్రత్యక్షంగా, పట్టణాల్లో పరోక్షంగా కొనసాగుతున్నదని, దీనిపై ఏప్రిల్‌లో జరిగే ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాల్లో పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ జిల్లా రాంనగర్‌లోని కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటికీ దళితులకు గుడిలోపలికి ప్రవేశం లేని గ్రామాలు, బతుకమ్మ ఆడనీయని గ్రామాలు ఇంకా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్షవరం చేయకపోవడం, దసరా పండుగ సందర్భంగా జమ్మి ఆకు తెంపారని దాడి, హొటళ్ళలో రెండు గ్లాసుల పద్ధతి, పాఠశాలల్లో దళితులు మధ్యాహ్న భోజనం వంట చేస్తే విద్యార్థులు తినకపోవడం, రచ్చబండ మీద కూర్చోనీయకపోవడం వంటి కులవివక్ష రూపాలు కొనసాగుతున్నాయని అన్నారు. పట్టణాల్లో దళితులకు ఇల్లు అద్దెకు ఇవ్వడం లేదన్నారు. వీటన్నింటినీ పారదోలేందుకు ఉన్న చట్టాలు, జీవోలు, రాజ్యాంగ హక్కులను పాలకవర్గాలు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఏప్రిల్ నెల మొత్తాన్ని మహనీయుల మాసంగా కేవీపీఎస్ ప్రకటించి, పూలే, అంబేద్కర్ జన జాతరలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. కుల వివక్ష అంటరానితనం ఎక్కడ కొనసాగితే అక్కడ ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటం నిర్మించాలని అన్నారు. కులవివక్ష అంటరానితనాన్ని సమూలంగా నిర్మూలించేందుకు కెవిపిఎస్ సన్నద్ధం అవుతుందన్నారు. కులవివక్ష, అంటరానితనం, కుల దురహంకారహత్యలు సాంఘిక బహిష్కరణలు, జోగిని వ్యవస్థ ఇలాంటి వాటిని పారద్రోలేందుకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, రాజ్యాంగ హక్కులు, చట్టాలు అమలుకోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. నల్లగొండ జిల్లా కోర్టు ప్రణయ్ హత్య కేసులో ఇచ్చిన తీర్పుపట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన 128 కుల దురహంకార హత్యల్లో బలైన వారందరికీ నివాళులర్పించారు. కుల దురహంకార హత్యలకు పాల్పడిన ప్రతి ఒక్కరికీ నల్లగొండ జిల్లా కోర్టు మాదిరిగే తీర్పులు రావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మరో కుల దురహంకార హత్య జరగకుండా కులాంతర వివాహితుల కోసం రక్షణ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్, జిల్లా ఉపాధ్యక్షులు ధూడేపాక రాజేందర్, ముడుసు నారాయణ, గబ్బెట రాంకుమార్,దానబోయిన రాంబాబు, జిల్లా నాయకులు అంబాల రవీందర్, వేలు సుమన్, సదానందం, భాస్కర్, దామర రాజు, నరేష్ చందర్, వేల్పుల రవి, గజవెల్లి మొగిలి, కుమార్, సుభద్ర, సుకర్ణ, సౌజన్య, లావణ్య, శారద, భారతి, పాల్గొన్నారు.

BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT BENGALURU (SCCH-08)
MVC.NO.228/2024
BETWEEN: NAGARATHNAMMA AND OTHERS ..... PETITIONER
AND: MAHENDER REDDY.G AND ANOTHER ..... RESPONDENTS
NOTICE TO RESPONDENT NO. 1
G. Mahender Reddy S/o. MR Basker Reddy, Major R/at: Flat No.: 22010, Janapriya Apts, Attapur, Secunderabad-500003. Hyderabad, Telangana, India (RC Owner of Car AP-13-AC-6570)
WHEREAS, The petitioner has instituted the above case against the Respondent No. 1 & 2 claiming compensation of Rs.50,00,000/-(Fifty Lakh only) for the injuries occurred in a Road Traffic Accident, which took place on 10/07/2023 at 3:35 to 3:40 PM, In front of Prerana school near Thippanna Land, Srinivasapura Taluk, Kolar, Karnataka. Involved Car/ AP 13-AC-6570. You are hereby summoned to appear before this court in person or by pleader on 29.4.2025 at 11.00 A.M, failing which the case will be disposed of Exparte.
Given under my Hand and seal of the court on this 4th Day of March 2025
BY ORDER OF THE COURT
ASSISTANT REGISTRAR COURT OF SMALL CAUSES BENGLAURU
ADVOCATE ADDRESS: Kiran.C.B, Advocate, office at: No. 8, 2nd Cross, N.G.Halli, Nagasandra Post, Bengluru-73

21 నుంచి 'పది' పరీక్షలు

- హాజరు కానున్న 5,09,403 మంది విద్యార్థులు
- 2,650 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- ఐదు నిమిషాల వరకు గ్రేస్ పీరియడ్
- ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షలు ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదోతరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపొజిట్ కోర్సు, సైన్స్ సబ్జెక్టులకు మినహా మిగతా సబ్జెక్టుల పరీక్షలన్నీ అదే సమయంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపొజిట్ కోర్సు సబ్జెక్టు పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. సైన్స్ సబ్జెక్టును రెండు విభాగాలుగా నిర్వహిస్తామనీ, పార్ట్-1 ఫిజికల్ సైన్స్, పార్ట్-2 బయలాజికల్ సైన్స్‌గా నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాటిని వేర్వేరు రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామని వివరించారు. పదో తరగతి పరీక్షలకు 11,547 పాఠశాలల నుంచి 5,09,403 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. వారిలో అబ్బాయిలు 2,58,895 మంది, అమ్మాయిలు 2,50,508 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,650 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 2,650 మంది చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), 2,650 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో)లతోపాటు 28,100 మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. విద్యార్థుల హాల్‌టికెట్లను ఇప్పటికే సంబంధిత పాఠశాలలకు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ద్వారా పంపించామని పేర్కొన్నారు. హాల్‌టికెట్లను విద్యార్థులు సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్ ద్వారా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచామని వివరించారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామనీ, విద్యార్థులకు ఏమైనా సందేహాలు, సమస్యలుంటే 040-23230942 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని కృష్ణారావు పేర్కొన్నారు. పరీక్షలు జరిగే సమయంలో ఆ చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లు మూసేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులకు ఉదయం 9.35 గంటల వరకు అనుమతి ఉంటుందనీ, ఐదు నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఉంటుందని వివరించారు. ట్రాఫిక్, ఇతర సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఒకరోజు లేదా రెండు రోజుల ముందు పరీక్షా కేంద్రాలను చూసుకోవాలని విద్యార్థులను కోరారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం పాఠశాల విద్యాశాఖ సంచాలకులు సీనియర్ అధికారులను జిల్లా స్థాయిలో పరిశీలకులుగా నియమించారని వివరించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. మాల్ ప్రాక్టీస్ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా 144 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించామని పేర్కొన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామని వివరించారు. చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు, సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావడాన్ని నిషేధించామని పేర్కొన్నారు. పరీక్ష విధుల్లో ఉండే వారికి ఫొటో గుర్తింపు కార్డులను ఇచ్చామనీ, ఇతరులు రాకుండా ఉండేందుకు దోహదపడుతుందని వివరించారు. విద్యార్థులు హాల్‌టికెట్, ప్యాడ్, పెన్, పెన్సిల్, స్కేల్, షార్ప్‌నర్, ఎరేసర్, జియోమెట్రిక్ పరికరాలను అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థులు ఓఎంఆర్ పత్రాలను సరిచూసుకోవాలని సూచించారు.

రాష్ట్ర కుల గణన దేశానికి రోల్ మోడల్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ కుల గణన దేశానికి రోల్ మోడల్ అయిందని రాహుల్ గాంధీ పార్లమెంటులో ప్రస్తావించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు వి.శంకరయ్య, వి.శ్రీహరితో కలిసి ఆయన మాట్లాడారు. బిల్లు ఆమోదానికి సహకరించిన ప్రతిపక్షాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అసెంబ్లీ చరిత్రలో 2025, మార్చి 17 సువర్ణ అక్షరాలతో రాసుకునే రోజు అని, కుల గణన ఆధారంగా బలహీన వర్గాలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించామని అన్నారు. బిసి బిడ్డ కానప్పటికీ రేవంత్‌రెడ్డి బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆలోచించారన్నారు. రాజకీయ, విద్యా, ఉపాధిపరంగా బిల్లు ఆమోదించే సమయంలో సభలో తాము ఉండటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు గతంలో కుల గణనను తప్పుపట్టినా బిల్లుకు మద్దతు తెలపడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కేంద్రం తొమ్మిదో షెడ్యూల్‌కు రాజ్యాంగ సవరణ చేసి రిజర్వేషన్లు అమలు చేయడంలో ప్రతిపక్ష పార్టీలు సహకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, రేవంత్‌రెడ్డికి, మంత్రులకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ఎమ్మెల్యే వి శంకరయ్య మాట్లాడుతూ.. బలహీన వర్గాలకు న్యాయం చేయాలని తీసుకున్న నిర్ణయం ఇదన్నారు. మేధావులు, ప్రజా సంఘాలతో చర్చలు చేసి, చిత్తశుద్ధితో బిల్లు ప్రవేశపెట్టామన్నారు. ఎమ్మెల్యే వి శ్రీహరి మాట్లాడుతూ.. ఎవరి వాటా ఎంతో చూపించే ప్రయత్నం కుల గణన ద్వారా చేశామన్నారు. పిఎం మోడీ అపాయింట్‌మెంట్ కోరామని, బిజెపి నేతలు ఈ విషయంలో వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకంలో వికలాంగుల కార్పొరేషన్‌ను చేర్చాలి

- ఎన్‌పిఆర్‌డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజీవ్ యువ వికాసం పథకంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ కార్పొరేషన్లతో పాటు వికలాంగుల కార్పొరేషన్‌ను కూడా చేర్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం గౌరవ అధ్యక్షురాలు వరమ్మ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రూ. ఆరు వేల కోట్లతో ఐదు లక్షల మంది నిరుద్యోగులకు రూ.లక్ష నుండి రూ.నాలుగు లక్షల వరకు లోన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం చేసిందని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా రూ.25 వేల మంది నిరుద్యోగ వికలాంగులకు మేలు జరుగుతుందని తెలిపారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఐదు శాతం ప్రత్యేకంగా వికలాంగులకు కేటాయించాలని గుర్తు చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్ విడుదల చేసిన నోటిఫికేషన్లలో ఎక్కడ కూడా వికలాంగులకు రిజర్వేషన్ అమలు చేస్తామని పేర్కొనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీవ్ యువ వికాసం పథకంలో వికలాంగుల కార్పొరేషన్‌ను చేర్చకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

ప్రశ్నోత్తరాలు నిర్వహించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో క్వశ్చన్ హావర్‌లో సమస్యలపై చర్చించాలని అడుగుతుంటే.. ప్రభుత్వం ప్రశ్నోత్తరాలను రద్దు చేసి.. తప్పించుకోవాలని చూస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ప్రజలు తిరుగబడుతున్నారని, ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితుల్లో సమస్యలపై చర్చ జరగాలని అన్నారు. రైతు రుణ మాఫీపై క్వశ్చన్ హావర్ రద్దు చేశారని, ఎక్కడ సమస్యలు లేవనెత్తాలో చెప్పాలని ప్రశ్నించారు. ఎందుకు ప్రభుత్వం దాటవేసే ధోరణితో వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. యాసంగి పంటకు రైతులకు నీళ్లు అందక ఇబ్బంది పడుతున్నారని, దీనిపై చర్చ లేదన్నారు. మోటార్లు కాలిపోతున్నాయని, నాణ్యమైన కరెంటు సరఫరాపై క్వశ్చన్ హావర్‌లో పెట్టామన్నారు. రైతు భరోసాపై చర్చ జరగాలన్నారు. కెసిఆర్ ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, దాన్ని పక్కకు పడేశారని.. దీనిపై సమాధానం లేదన్నారు. వడ్ల సేకరణపై తాము క్వశ్చన్ హావర్‌లో లేవనెత్తాలని చూశామని, ఇవన్నింటి నుంచి ప్రభుత్వం తప్పించుకోవాలని ప్రశ్నోత్తరాలను చేసిందని ఆరోపించారు. క్వశ్చన్ హావర్ నిర్వహించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

బాత్‌రూమ్ పైకప్పు పెచ్చులూడిపడి విద్యార్థికి గాయాలు

- ఒయు టెక్నాలజీ విద్యార్థుల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఓయూలోని టెక్నాలజీ హాస్టల్ బాత్ రూమ్ పైకప్పు పెచ్చులూడి పడి ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ వసతి గృహంలో అన్ని రూమ్‌లలో ఇలాగే స్లాబ్ పెచ్చులు ఊడి ప్రమాదంగా ఉన్నాయని ఇప్పటికే విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకపోవడంతో తమ ప్రాణాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు మంగళవారం యూనివర్సిటీలో రాస్తారోకో నిర్వహించారు. హాస్టల్ బాత్రూం పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయని గతంలో ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నూతన హాస్టల్ భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల రాస్తారోకో నేపథ్యంలో ఓయూలో పోలీసులు భారీగా మోహరించారు. ఒయుకు వెళ్లే రహదారులను బంద్ చేశారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిప ప్రొ.రమేష్ కుమార్, వైస్ ప్రిన్సిప ప్రొ.శ్రీనునాయక్, వార్డెన్, అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన విద్యార్థిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాయంత్రం ఈ విషయాన్ని వారు ఒయు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఎల్బీనగర్ ఎమ్మెల్యేపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదైంది. తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని హైదరాబాద్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యేను వెంటనే అరెస్టు చేయాలని ఎల్బీనగర్ జోన్ డిసిపి ప్రవీణ్‌కుమార్‌కు కూడా కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల మన్సూరాబాద్ పరిధిలో అబివృద్ధి పనులకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. తనను పిలవలేదని స్థానిక బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తన అనుచరులతో వెళ్లి అవే పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేశారు. దాంతో బిఆర్‌ఎస్ శ్రేణులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరు గ్రూపుల పోటాపోటీ ఆందోళనలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి బీఆర్‌ఎస్ శ్రేణులను అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అనుచరులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పలువురు కార్పొరేటర్లపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. దాంతో ఎమ్మెల్యేపై హస్తినాపురం కార్పొరేటర్ ఎల్బీనగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

హైదరాబాద్‌లో స్మార్ట్‌వర్క్స్ నాలుగు కేంద్రాలకు విస్తరణ

హైదరాబాద్ : వర్క్ స్పేస్ ప్రొవైడర్ స్మార్ట్‌వర్క్స్ కో వర్కింగ్ స్పేసెస్ హైదరాబాద్‌లో మరో 2.20 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని అద్దెకు తీసుకుంది. గచ్చిబౌలిలోని డిఎల్‌ఎఫ్ సైబర్ సిటీలోని బ్లాక్3లోని వాణిజ్య స్థలాన్ని తీసుకున్నట్లు ఆ కంపెనీ వెల్లడించింది. దీంతో ఆ సంస్థ ఇక్కడ నాలుగు సెంటర్లకు విస్తరించినట్లయ్యింది. ఇప్పటికే రాయదుర్గా లోని పూర్వ సమ్మిట్, కొండాపూర్‌లోని గెలాక్సీ, మాధాపూర్‌లోని రహేజా మైండ్‌స్పేస్‌లోని బిల్డింగ్ 3ఎ, 3బిల్లో కేంద్రాలను కలిగి ఉంది. అన్ని రంగాల నుంచి హైదరాబాద్ స్థిరమైన డిమాండ్‌ను కలిగి ఉందని స్మార్ట్‌వర్క్స్ ఫౌండర్ నితీష్ సర్దా పేర్కొన్నారు. ఆధునిక పని ప్రదేశాలు, సౌకర్యాలను పలు కంపెనీలు కోరుకుంటున్నాయన్నారు.

శరత్ సిటీ మాల్‌లో నొబెరో అవుట్‌లెట్ ఏర్పాటు

హైదరాబాద్ : ఫ్యాషన్ లీజర్ బ్రాండ్ నొబెరో తాజాగా హైదరాబాద్‌కు విస్తరించినట్లు ప్రకటించింది. నగరంలోని శరత్ సిటీ మాల్‌లో తమ మొదటి ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ అవుట్‌లెట్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. ప్రస్తుతం తమకు 30 అవుట్‌లెట్‌లు ఉన్నాయని.. 2026 చివరి నాటికి దేశ వ్యాప్తంగా 25 స్టోర్‌లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని నొబెరో సహ వ్యవస్థాపకుడు, సిఇఒ ప్రశాంత్ ఆలూరు పేర్కొన్నారు.

ఎల్‌ఎల్‌బి 3 సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్లో సర్దుబాట్లు

- ఐలు, ఎల్‌ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎల్‌ఎల్‌బి మూడో సెమిస్టర్ పరీక్ష షెడ్యుల్ లో అవసరమైన సర్దుబాట్లు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ప్రధాన కార్యదర్శి పార్థసారథి, లా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఎస్‌ఎఫ్‌ఐ) కోరాయి. ఈ మేరకు మంగళవారం ఉస్మానియా యూనివర్శిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శశికాంత్, ఓఎస్డి వైస్ ఛాన్సలర్ డాక్టర్ జితేందర్ కుమార్‌లకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఉగాది, రంజాన్ పండుగలు షెడ్యూల్ మధ్యలో ఉండటం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎల్‌ఎస్‌ఎఫ్‌ఐ స్టేట్ కమిటీ సభ్యులు అలీ హైదర్, చంద్రకాంత్ (సికె), అలీ జాన్, ఎండి తక్కి తదితరులున్నారు.

బతుకు మార్చే విధానాలు కావాలి

- పని ప్రదేశంలో మహిళలకు భద్రత కరువు
- చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి
- వ్యవసాయ మహిళా కార్మికుల సదస్సులో మల్లు లక్ష్మి

సదస్సులో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"తాత్కాలిక ప్రయోజనం కల్పించే సంక్షేమ పథకాలు కాదు కావాల్సింది.. బతుకు మార్చే విధానాలను పాలకవర్గాలు తేవాలి. చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్లు మహిళలకు అమలు చేయాలి" అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో అంబాల స్వరూప అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ మహిళా కూలీల సదస్సులో ఆమె మాట్లాడారు. భూమిపైన మహిళలకు హక్కు కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. పని ప్రదేశంలో మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. గ్రామీణ వ్యవసాయ ఉత్పత్తి రంగంలో మహిళల శ్రమ 78శాతంగా ఉన్నా.. వారసత్వ ఆస్తిపై మహిళలకు హక్కు లేదన్నారు. గ్రామీణ వ్యవసాయ కార్మికులు నిలువ నీడ కోసం 120 గజాల ఇండ్ల స్థలం కావాలని అడిగితే భూమి లేదని చెప్పే పాలకులు.. బడా కార్పొరేట్ కంపెనీలకు మాత్రం వందలాది ఎకరాలను ఎలా అప్పగిస్తున్నారని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను ఆక్రమించి వెంచర్స్ వేసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడానికి సిద్ధపడరని, కానీ నివాసానికి గుడిసెలు వేసుకున్న వారిపై బుల్డోజర్లు పెట్టి నిర్బంధంగా కూల్చి వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వామపక్షాల ఒత్తిడి మేరకు తెచ్చిన ఆహార భద్రత చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నీరుగారుస్తున్నదని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కేరళలో ఉన్న వామపక్ష ప్రభుత్వం పౌరసరఫరా దుకాణాల నుంచి 14 రకాల సరుకులు ఇస్తుంటే, కేంద్ర ప్రభుత్వం మనిషికి ఐదు కేజీల బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుంటుందని విమర్శించారు. పౌష్టికాహారం అందక మహిళల్లో రక్తహీనత పెరుగుతున్నదని చెప్పారు. మహిళలపై పని ప్రదేశంలో లైంగికదాడులు పెరుగుతున్నా నిందితులపై చర్యలు లేవన్నారు. మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ మాట్లాడుతూ.. మహిళా సాధికారత పేరుతో మాటలే చెప్తున్నారు తప్ప ఆచరణ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ.2500, భూమిలేని వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు, ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనిని విస్తరింప చేస్తామన్న హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడిరాజుల రాములు, సారంపల్లి వాసుదేవరెడ్డి, నాయకులు లోకిని స్వరూప, వేలు రజిత, రమ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీకి 'సురవరం' పేరు పెట్టినందుకు

ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు కృతజ్ఞతలు

- సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్, కుటుంబ సభ్యులు

సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు సాహిత్య రంగంలో భావితరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ సుప్రసిద్ధ రచయిత, వైతాళికులు సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, మద్దతిచ్చిన ప్రతిపక్షాలకు సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్, తెలంగాణ సారస్వత పరిషత్, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య కృషిని గుర్తించాలనే ప్రజలందరి ఆకాంక్షలను సిఎం రేవంత్ రెడ్డి గౌరవించినందుకు ట్రస్ట్ అభినందనలు తెలిపింది. ప్రతి ఏడాదీ మే 28న ప్రతాపరెడ్డి జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని, దాశరథి పురస్కారం మాదిరిగానే 'సురవరం ప్రతాపరెడ్డి పురస్కారాన్ని' ఇవ్వాలని ప్రభుత్వానికి ట్రస్ట్ విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ట్రస్ట్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలుగు సాహిత్యం, జర్నలిజం రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వారికి అవార్డుతోపాటు ఈ రంగాల్లో అధ్యయనం చేస్తున్న ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌ను "సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం" తరపున ఇవ్వాలని ట్రస్ట్ భావిస్తున్నదని, దీనిపై ట్రస్ట్ కమిటీ త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. మరోవైపు కేంద్ర సాహిత్య అకాడమీ ఆదేశాల మేరకు సురవరం ప్రతాపరెడ్డి జీవితం, సాహిత్య కృషిపై "సురవరం ప్రతాపరెడ్డి వాచకం" పుస్తకాన్ని రచించానని, అది ప్రచురణ కావాల్సి ఉందని వెల్లడించారు. ప్రతాపరెడ్డి రంచించిన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'కు ప్రత్యామ్నాయ రచనలు నేటికీ లేవన్నారు. ట్రస్టీలు పుష్పలత మాట్లాడుతూ.. తెలుగు భాష మాట్లాడలేని పరిస్థితుల్లో తెలుగు జాతిని మేల్కొల్పేందుకు, తెలుగు సాహిత్య వికాసానికి సురవరం ప్రతాపరెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు. డాక్టర్ కృష్ణవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడానికి కృషి చేసిన కమ్యూనిస్టు నేత సురవరం సుధాకర్ రెడ్డి, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు, సహకరించిన ప్రభుత్వం, ఇతర ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కొండా లక్ష్మీకాంతారెడ్డి, టియుడబ్ల్యుజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ట్రస్ట్ సంయుక్త కార్యదర్శి జె.చెన్నయ్య మాట్లాడుతూ.. ఇది ఒక వ్యక్తికి కాకుండా తెలుగు సాహిత్య రంగానికి, తెలుగు జర్నలిజానికి, యావత్ సమాజానికి దక్కిన గౌరవమని, తద్వారా తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తమైందని అన్నారు. ట్రస్ట్ సభ్యులు, ప్రతాపరెడ్డి మనుమలు సురవరం అనిల్‌రెడ్డి, సురవరం కపిల్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పడం కాంగ్రెస్ నైజం

- మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాట తప్పడం, మడమ తిప్పడం కాంగ్రెస్ పార్టీ నైజమని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి విమర్శించారు. మంగళవారం శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాలను వంచించినట్టు విద్యార్థులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ సభలో తామిచ్చిన హామీలను అమలు చేయలేమని కాంగ్రెస్ పార్టీ చేతులెత్తేసిందని తెలిపారు. డిగ్రీ, ఆపై చదివే విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు సమీక్షించుకోవాలని సూచించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తులం బంగారం ఇయ్యబోమని నిన్న తులం బంగారం ఇయ్యమని శాసనమండలి సాక్షిగా చెప్పారని తెలిపారు. ఆడపిల్లలకు స్కూటీలు ఎగ్గొట్టే పని చేస్తున్నారని విమర్శించారు. రూ.ఒక లక్ష 50 వేల కోట్ల అప్పు చేసి హామీలు విస్మరించారని తెలిపారు. కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీకి విద్యార్థినీలు పోస్ట్ కార్డులు రాస్తున్నారని చెప్పారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

బాలిక అపహరణ.. వ్యభిచారం రొంపిలోకి దించే యత్నం..

- ఆరుగురు సభ్యుల ముఠా అరెస్ట్
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ నగరంలో ఓ బాలికను అపహరించి లైంగికదాడికి పాల్పడిన అనంతరం వ్యభిచారం చేయించేందుకు యత్నిస్తున్న ఆరుగురు.. ఒక బాలిక, ఒక మహిళ, నలుగురు వ్యక్తులున్న సభ్యుల ముఠాను మిల్స్‌కాలనీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి ఒక కిలో 800 గ్రాముల గంజాయితో పాటు ఒక కారు, రూ.75వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లతో పాటు ప్రధాన నిందితురాలి ఇంటి వద్ద భారీస్థాయిలో కండోమ్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం జరిపిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 11న ఓ బాలిక అదృశ్యంపై ఫిర్యాదు రాగా మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సదరు బాలికను ములుగు క్రాస్ రోడ్డు వద్ద గుర్తించి పోలీసుల సంరక్షణలో తీసుకొని విచారించారు. తనను కొంతమంది వ్యక్తులు అపహరించి గంజాయి తాగించారని, అనంతరం లైంగికదాడికి పాల్పడినట్టు బాలిక పోలీసులకు వెల్లడించింది. దాంతో అప్రమత్తమైన పోలీసులు.. సెంట్రల్ డీసీపీ షేక్ సలీమా పర్యవేక్షణలో వరంగల్ ఏసీపీ అధ్వర్యంలో మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. దర్యాప్తు భాగంగా నిందితులను గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో నిందితులు వరంగల్ జిల్లా దామెర మండలం ల్యాదేళ్ళ గ్రామానికి చెందిన ముస్కు లత, ఓ బాలిక, వరంగల్‌లోని శంభుని పేటకు చెందిన అబ్దుల్ అఫ్నాన్, షేక్‌సైలాని బాబా, మహ్మద్ అల్తాఫ్, మీర్జా ఫైజ్‌బేగ్ ఆలియాస్ వదూద్‌ను పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసినట్టు సిపి తెలిపారు.

సెక్యూరిటీ గార్డుల వేతనాలు వెంటనే ఇవ్వాలి

- యూనియన్ అధ్యక్షులు ఎం వెంకటేష్
- ఆస్పత్రిలో విధులను బహిష్కరించి ధర్నా

సెక్యూరిటీలతో మాట్లాడుతున్న ఎం వెంకటేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో ఒపిడిఎస్ సెక్యూరిటీ సంస్థ కింద పనిచేస్తున్న కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డులకు బకాయి ఉన్న జనవరి, ఫిబ్రవరి నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని నిమ్స్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం సెక్యూరిటీ గార్డులు వర్క్ బాయ్‌కాట్ చేసి నిమ్స్ ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెక్యూరిటీ గార్డులకు ప్రతినెలా వేతనాలు చెల్లించడంలో కాంట్రాక్టర్‌తోపాటు నిమ్స్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. చట్టం ప్రకారం ప్రతి నెలా 7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని ఉన్నా అమలు జరగడం లేదన్నారు. సెక్యూరిటీ గార్డులకు ప్రతినెలా వేతనాలతోపాటు పేస్లిప్స్ ఇవ్వాలని లేబర్ కమిషనర్ చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. డబుల్ డ్యూటీలు చేయించుకుంటూ.. వేతనాలు సరిగా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా 7వ తేదీలోపు వేతనాలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కనీస వేతన చట్టం ప్రకారం ఐదేళ్లకోసారి వేతనాలు పెంచాలని ఉన్నా గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కానీ పెంచలేదని విమర్శించారు. 2021లో సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం పెంచుతూ సెక్యూరిటీ సర్వీసెస్ జీవో 21 వచ్చిందన్నారు. దానిపై యాజమాన్య సంఘాలు కోర్టుకు వెళ్లడంతో ఆ జీవోను గెజిట్ చేయకుండా అప్పటి ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు. ప్రస్తుతం సెక్యూరిటీ సర్వీసెస్ జీవో 21ని వెంటనే గెజిట్ చేసి కనీస వేతనాలు రూ.18,019/-కు పెంచాలని హైకోర్టు డైరెక్షన్ ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. అందువల్ల.. సెక్యూరిటీ సర్వీసెస్ జిఓతో పాటు ఇతర జిఓలను గెజిట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఒపిడిఎస్ కాంట్రాక్ట్ సంస్థ ఆపరేషన్ మేనేజర్‌తో జరిగిన చర్చల్లో.. బకాయి వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారు. దాంతో సెక్యూరిటీ గార్డులు తిరిగి విధుల్లో చేరారు.